కేటీఆర్‌కు శుభాకాంక్షలు

దసరా పండుగను పురస్కరించుకొని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.వెంకటరెడ్డి, మిర్యాల శ్రీనివాస్ మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

– అంబర్‌పేట, అక్టోబర్ 15

పార్టీ అభిష్టానం మేరకు నిర్ణయం

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, అక్టోబర్ 15 : మూసీ పరీవాహక ప్రాంత ఎమ్మెల్యేలను తీసుకొని దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లాలనే ప్రభుత్వ నిర్ణయంపై అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ స్పందించారు. ప్రభుత్వం నుంచి తనకు ఆహ్వానం అందిందని చెప్పారు. అయితే తమ పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటే ఆ ప్రకారం నడుస్తానని తెలిపారు. ఈ విషయాన్ని పార్టీ దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగిందని అన్నారు.

హైడ్రా కమిషనర్‌ను కలిసిన వీహెచ్



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రంగనాథ్‌ను శాలువాతో సన్మానించారు.

– అంబర్‌పేట, అక్టోబర్ 15

డాక్టర్ శ్రీనివాస్‌రావుకు అవార్డు

గోల్కొండ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి. శ్రీనివాస్‌రావుకు గోల్కొండ బోనాల కుల వృత్తుల సంఘం మాజీ అధ్యక్షుడు, సలహాదారు బి. సాయిబాబాచారి మంగళవారం అవార్డును అందించారు. దసరాను పురస్కరించుకుని వివిధ రంగాలలో ఉత్తమ సేవలందించిన వారికి అవార్డులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. పూజారి బి. సురేశ్‌చారి పాల్గొన్నారు.

–మెహిదీపట్నం, అక్టోబర్ 15

27న ఐఎంఏ రాష్ట్ర శాఖ ఎన్నికలు

కోఠి ఐఎంఏ రాష్ట్ర శాఖ కార్యాలయంలో మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర ఎలక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ విజయచందర్‌రెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 15 : అల్లోపతి వైద్య రంగంలో అతిపెద్ద ఎన్జీవోగా కొనసాగుతున్న ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర శాఖకు ఈ నెల 27న ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కోఠిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఎలక్షన్ కమిషన్ కన్వీనర్ డాక్టర్ ఈ విజయేందర్‌రెడ్డి, సభ్యులు డాక్టర్ పీఆర్ సాయికుమార్, పాస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్యాంసుందర్. రాష్ట్ర శాఖ కార్యదర్శి డాక్టర్ జే విజయ్‌రావు, కోశాధికారి డాక్టర్ రాజేందర్ కుమార్ యాదవ్‌లతో కలిసి మాట్లాడుతూ.. దేశంలోనే ఐఎంఏ 4 లక్షల సభ్యత్వం కలిగిన అతిపెద్ద ఎన్జీవో అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర శాఖలో 20 వేల మంది సభ్యులతో 76 శాఖలతో అల్లోపతి వైద్యుల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడుతుందని అ న్నారు. కాగా అక్టో బర్ 31వ తేదీతో ప్రస్తుత ఐఎంఏ రాష్ట్ర శాఖ పదవీ కాలం ముగియడంతో ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించడం జరిగిన విషయం విదితమే. ఈ సందర్భంగా ఎన్నికల బరిలో నిలిచే పోటీదారుల ఫైనల్ లిస్ట్‌ను ఆయన విడుదల చేశారు. నేటి నుంచి 26వ తేది వరకు అభ్యర్థులు ప్రచారం నిర్వహించుకునేందుకు సమయాన్ని కేటాయించినట్లు తెలిపారు.అక్టోబర్ 27న కోఠిలోని రాష్ట్ర శాఖ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు కొనసాగుతాయని అన్నారు. ఈ ఎన్నికలను 17 పోస్టులకు నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు 92 మంది అభ్యర్థులు నా మినేషన్ ధాఖలు చేయగా అందులో ముగ్గురు అభ్యర్థుల నామినేషన్ తిరస్కరించడం జరిగిందని అన్నారు. ఇప్పటికే మూడవ జోన్ నుంచి రాష్ట్ర శాఖకు ప్రెసిడెంట్ ఎలెక్ట్‌గా డాక్టర్ వి. విజయ్‌కుమార్ ఎన్నిక ఏకగ్రీవ మైందని అన్నారు. అంతే కాకుండా స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుల 29 మంది, సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు 19 మందితో పాటు మరో 30 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయడం హర్షణీయం

కాండూరి క్రిష్ణమాచారి

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 15 : దేవాదాయ ధర్మాదాయ శాఖలో విధులు నిర్వహిస్తున్న అర్చక, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కృషి చేయడం హర్షణీయమని శాఖ జేఏసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాండూరి క్రిష్ణమాచారి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శాఖలో 11 మందికి సెకండ్ గ్రేడ్, 33 మంది జూనియర్ అసిస్టెంట్‌లకి పదోన్నతులు కల్పించారని గుర్తు చేశారు. అంతే కాకుండా అర్చక, ఉద్యోగుల ప్రతి సమస్యను తెలుసుకుంటూ పరిష్కార దిశగా కృషి చేస్తున్నందుకు యావత్ అర్చక, ఉద్యోగుల పక్షాన మంత్రి కొండా సురేఖకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అర్చక వెల్ఫేర్ బోర్డు నుంచి అర్చక, ఉద్యోగులందరికీ అతి త్వరలో హెల్త్ ఇన్సూరెన్స్‌తో పాటు పలు అవసరాలను తీర్చే విధంగా మంత్రి కృషి చేస్తారని ఆయన ఆకాంక్షించారు.

ఫాలూన్ దఫాతోనే మానసిక ప్రశాంతత

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఫాలూన్ దఫా శిక్షకులు సుబ్రహ్మణ్యం

రవీంద్రభారతి, అక్టోబర్ 15 : మనిషి ప్రశాంతమైన జీవన గమనం ఫాలూన్ దఫా (ఉన్నత మార్గం)తో సాధ్యమని ఫాలూన్ దఫా సాధన శిక్షకులు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫాలూన్ దఫా అంటే ఒక అత్యున్నతమైన సాధన అభ్యాసం అని, విశ్వసూత్రమైన సత్యం, దయ, సహగుణములను గురించి చేసే ఒక శారీరక, మానసిక ఆధ్యాత్మిక సాధనమని పేర్కొన్నారు. 114 దేశాల్లో 10 కోట్ల మంది ఫాలూన్ దఫాను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఫాలూన్ దఫాను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఫాలూన్ దఫాను అభ్యసించి ఆరోగ్యాలను కాపాడుకోవచ్చునని సూచించారు. కర్ణాటక శిక్షకులు భారత్ ఫాలూన్ దఫా ఆసనాలు మీడియా ప్రతినిధుల సమక్షంలో ప్రదర్శించారు.

డిసెంబర్ 5న సౌత్ స్టార్ రైల్ ప్రారంభం

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ, తెలంగాణ రీజినల్ డైరెక్టర్ రమేశ్ అయ్యంగార్, సౌత్ స్టార్ రైల్ డైరెక్టర్ విఘ్నేశ్

రవీంద్రభారతి, అక్టోబర్ 15: కర్ణాటక ఆలయాలను సందర్శించే సువర్ణ అవకాశం టూర్ టైమ్స్ కల్పిస్తున్నది. ఇండియన్ రైల్వేస్, భారత్ గౌరవ్ రైలు పథకం కింద తొలిసారిగా ప్రైవేట్ సెక్టార్‌కు చెందిన సౌత్ స్టార్ రైల్ డిసెంబర్ 5న చెన్నైలో ప్రారంభ అవుతుందని టూర్ టైమ్స్ ఏపీ, తెలంగాణ రీజినల్ డైరెక్టర్ రమేశ్ అయ్యంగార్, సౌత్ స్టార్ రైల్ డైరెక్టర్ విఘ్నేశ్ వెల్లడించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సౌత్ స్టార్ రైల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ రైల్ 9 రోజుల వ్యవధిలో కర్ణాటకలోని నవబృందావనం, గోకర్ణ, మురుడేశ్వర్, కొల్లూరు, శృంగేరి, హోరనాడు, ధర్మస్థల, కుకి సుబ్రమణ్యం, మైసూరు, శ్రీరంగపట్నం, మేల్కోటేలను సందర్శించవచ్చునని పేర్కొన్నారు. ప్రతి కోచ్‌లో సీసీ టీవీ కెమెరాలు, టూర్ మేనేజర్, సెక్యూరిటీ గార్డ్స్ వంటి అనేక రకాల సౌకర్యాలు ఉన్నాయన్నారు. భోజన వసతి కూడా కల్పిస్తునట్లు వెల్లడించారు. ఏపీ, తెలంగాణలో ఈ రైలు ఎక్కేందుకు గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, నల్లగొండ, మిర్యాలగూడ, సికింద్రాబాద్‌లలో వీలు కల్పిస్తున్నామన్నారు.సీనియర్ సిటీజన్స్‌కు కూడా సబ్సిడీ కల్పిస్తునట్లు తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ ప్రయాణం కోసం లీవ్ ట్రావెల్ కన్సెషన్(ఎల్టీసీ)ని ఉపయోగించుకోవచ్చునని అన్నారు.స్లీపర్ క్లాస్‌కు రూ. 27,000, ప్యాకేజీ థర్డ్ ఏసీకి రూ.33,000, థర్డ్ ఏసీ ప్రీమియం రూ..37000, సెకండ్ ఏసీకి 40,00తో ప్రారంభమవుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న యాత్రికులు www. traintour.in లేదా 9355021516 నంబర్‌ను సంప్రదించాలి.

తాగునీటి పైపులైన్ పనులను పరిశీలించిన కార్పొరేటర్

అంబర్‌పేట, అక్టోబర్ 15 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ జంజం మసీదు, గంగాబౌళి వద్ద తాగునీటి పైపులైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకటరెడ్డి మంగళవారం పరిశీలించారు. వాటర్‌వర్క్స్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణతో కలిసి ఈ పనులను పర్యవేక్షించారు. పనులు తొందరగా పూర్తి చేయాలని చెప్పారు.

మహేశ్ వైష్ణవికి అభినందనలు

కామన్‌వెల్త్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో బంగారు పతకాన్ని సాధించిన మహేశ్ వైష్ణవికి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపిన బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు. చిత్రంలో గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు అశీష్‌కుమార్ యాదవ్ ఉన్నారు.

– అబిడ్స్, అక్టోబర్ 15

స్వదేశీ మేళా వెబ్‌సైట్ ప్రారంభం

కాచిగూడ, అక్టోబర్ 15 : స్వదేశీ జాగరణ్ మంచ్ తెలంగాణ ఆధ్వర్యంలో swadeshi melatelangana.in వెబ్‌సైట్‌ను కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మంగళవారం బర్కత్‌పురలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వదేశీ ఉత్పత్తులు, స్థానిక వ్యాపారస్తులను ప్రోత్సహిస్తున్న ఈ వెబ్‌సైట్‌ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్వదేశీ జాగరణ్ మంచ్ తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి రచ్చ శ్రీనివాస్, స్వదేశీ మేళా కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, స్వదేశీ జాగరణ మంచ్ ప్రాంత ప్రచార ప్రముఖ్ కేశవ్‌సోని తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

దసరా పండుగను పురస్కరించుకొని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని మంగళవారం అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు సి.శ్రీనివాస్‌ముదిరాజ్, ఏడెల్లి అజయ్‌కుమార్, కెంచె చంద్రశేఖర్, ఎం.ర వీందర్‌గౌడ్, డి.నాగభూషణంచారి, యాదగిరి, అయోధ్య రాములు తదితరులు కిషన్‌రెడ్డిని సన్మానించారు.

– అంబర్‌పేట, అక్టోబర్ 15

విద్యార్థులు డ్రగ్స్‌కు బానిస కావద్దు

ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ భిక్షపతిరావు తదితరులు

కాచిగూడ, అక్టోబర్ 15 : యువత, ప్రయాణికులు మాదకద్రవ్యాలకు బానిస కావద్దని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలంగాణ యాంటి నార్కొటిక్ డ్రగ్స్ రైల్వే డీఎస్పీ పి. భిక్షపతిరావు కోరారు. డ్రగ్స్‌ను వాడితే కలిగే అనర్థాలపై మంగళవారం కాచిగూడ రైల్వేస్టేషన్‌లో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా భిక్షపతిరావు, రైల్వే ఇన్‌స్పెక్టర్లు సమ్యా నాయక్, ఎల్లప్ప హాజరై మాట్లాడు తూ.. డ్రగ్స్ మాఫియాపై విద్యార్థులు ఉక్కుపాదం మోపాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌ను అరికట్టేందుకు యువత సహకరించాలని ఆయన తెలిపారు.

హేమంత్‌అజయ్‌కి నివాళి

గుండెపోటుతో మృతి చెందిన వ్యాపారవేత్త హేమంత్ అజయ్(29) సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయం అని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన హేమంత్‌అజయ్ సంస్మరణ సభను మంగళవారం ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ సభకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్ఎస్ నగర నాయకుడు అనంతుల అనిల్, రాజనక్ ప్రవీణ్, పటేరి రాజు, ముజకరి దినేశ్, కాలేరు రాజు, వంజరి నాగరాజు విచ్చేసి అజయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– కాచిగూడ, అక్టోబర్ 15

దేవుని కుంట శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలి

ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజేశ్వర్, రాజిరెడ్డి తదితరులు

మెహిదీపట్నం, అక్టోబర్ 15 : ప్రజల అభివృద్ధికి అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటున్నామని నాంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. మంగళవారం విజయ్‌నగర్ కాలనీ డివిజన్ కైలాశ్‌నగర్‌లో ఉన్న దేవుని కుంట శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని కోరుతూ హైందవ సమాఖ్య నాయకులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ రెండు రోజుల్లో హిందూ శ్మశాన వాటికను సందర్శించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సాదుగుల రాజేశ్వర్, నాయకులు రాజిరెడ్డి, కుమార్, రామకృష్ణ, యాదయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడానికి కృషి చేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. మంగళవారం టోలీచౌకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గోల్కొండకు చెందిన షరీఫ్‌కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.60 వేల చెక్కును ఎమ్మెల్యే లబ్ధిదారుడికి అందించారు.

– మెహిదీపట్నం

కేటీఆర్‌ను కలిసిన ఆనంద్‌కుమార్‌గౌడ్

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావును గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్ కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కుటుంబ సమేతంగా వైష్ణవి దేవి ఆలయానికి వెళ్లి రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావులు ఆయురారోగ్యాలతో ఉండాలని రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావాలని పూజలు చేయించినట్లు ఆనంద్‌కుమార్‌గౌడ్ తెలిపారు. అక్కడి నుంచి అమ్మవారి ఆలయం నుంచి తీసుకువచ్చిన శాలువాను కేటీఆర్‌కు కప్పి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ ఆనందం వ్యక్తం చేశారు. మూసీ పరీవాహక ప్రాంతంలో ఉన్న ఇండ్లను కూల్చి వేసేందుకు అధికారులు సర్వే నిర్వహించారని వారిని కలిసి ధైర్యం చెప్పినట్లు తెలిపారు. మూసీ ప్రాంతంలోని బాధితులను కలిసి వారికి ధైర్యం చెప్పేందుకు కేటీఆర్ తప్పక వస్తారని ఆనంద్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

– అబిడ్స్, అక్టోబర్ 15

నోటుపుస్తకాలు పంపిణీ

అంబర్ పేట డివిజన్ సీపీఎల్ లకోటియా ప్రభుత్వ పాఠశాలలో భారత్ సేవాశ్రమ్ సంఘ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి హాజరై విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రోహిణి, డిప్యూటీ ఈవో విజయలక్ష్మి, భారత్ సేవాశ్రమ్ స్వామిజీలు మునీశ్వరానంద స్వామి, వేంకటేశ్వరానందస్వామి, బీజేపీ నాయకులు జి.ఆనంద్‌గౌడ్, నాగభూషణంచారి, యశ్వంత్, శ్యామ్‌రాజ్, భిక్షపతి, ఏడెల్లి అజయ్‌కుమార్, మైలా రం రాజు తదితరులు పాల్గొన్నారు.

– గోల్నాక, అక్టోబర్ 15

వ్యక్తిని హత్యచేసిన కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గోషామహల్ ఏసీపీ కె. వెంకట్‌రెడ్డి మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్, డీఐ మహేందర్

అబిడ్స్, అక్టోబర్ 15 : ఆస్తి తగాదాల నేపథ్యంలో వరుసకు సోదరుడైన వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటనలో ముగ్గురిని మంగళ్‌హాట్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గోషామహల్ ఏసీపీ కె. వెంకట్ రెడ్డి మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్, డీఐ మహేందర్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. లోయర్ ధూల్‌పేట్ బడీ గల్లి లాలా తాలీమ్ ప్రాంతానికి చెందిన దుర్గేశ్‌సింగ్‌కు అతని సమీప బంధువులైన ఠాకూర్ బజరంగ్‌సింగ్, తుల్జారామ్‌సింగ్, సత్యనారాయణ్‌సింగ్‌ల మధ్య భూ వివాదం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో దుర్గేశ్‌సింగ్‌ను హత మార్చాలని ముగ్గురు నిర్ణయించుకుని ఈ నెల 13వ తేదీన అర్ధరాత్రి అతని ఇంటిపై దాడి చేసి హత్య చేశారు. మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మంగళ్‌హాట్ పోలీసులు మంగళవారం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజు దర్యాప్తు చేస్తున్నారు.

హబీబ్‌నగర్‌లో వ్యక్తి అదృశ్యం

ఎం.విజయ్ రామ్

మెహిదీపట్నం, అక్టోబర్ 15 : దసరా రోజున ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి కనిపించుకుండా పోయిన ఘటన హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంబాగ్ కట్టా డి క్లాస్‌లో నివసించే విజయ్‌రామ్ నీలోఫర్ ఆస్పత్రిలో అసిస్టెంట్ ధోబీగా పనిచేస్తుండేవాడు. ఈ నెల 12 వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. దీంతో కుటుం బ సభ్యులు హబీబ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

బోధన్ రైల్లో దొంగతనం

కాచిగూడ,అక్టోబర్ 15: బోధన్ రైల్లో ప్రయాణికురాలి బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన ప్రకారం.. శాలిబండకు చెందిన సయ్యద్ ఇబ్రహీం భార్య పరిశాకనం(35)బోధన్-గుంతకల్ రైల్లో ఈ నెల 13వ తేదీన కాచిగూడ రైల్వేస్టేషన్‌లో దిగారు. 14వ తేదీన ఇంటికి వెళ్లి చూసుకునేసరికి బ్యాగులో ఉన్న 8.5 తులాల బంగారు ఆభరణాలు కన్పించలేదు. మంగళవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, తదుపరి విచారణ నిమిత్తం శాలిబండ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ, అక్టోబర్ 15: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(40)సోమవారం అర్ధరాత్రి ఫలక్‌నుమా-ఉందానగర్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై గోధుమ రంగు చొక్క, నలుపు రంగు ప్యాంట్ ధరించి.ఎత్తు 5.5 ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 99486 95948లో సంప్రదించాలి.

భగత్‌కోఠి రైల్లో దొంగతనం

కాచిగూడ,అక్టోబర్ 15: భగత్‌కోఠి రైల్లో ప్రయాణికురాలి నగదు, ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బేగంబజార్‌కు చెందిన భవేరిదేవి(38)భగత్‌కోఠి రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గమధ్యంలో బ్యాగులో ఉన్న రూ.5 లు, ఖరీదైన ఫోన్‌ను దొంగిలించుకుని పారిపోయారు. మంగళవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.

మూసీలో వ్యక్తి మృతదేహం లభ్యం

మెహిదీపట్నం, అక్టోబర్ 15 : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన లంగర్‌హౌస్ పరిధిలో మంగళవారం ఉదయం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లంగర్‌హౌస్ సంగం సమీపంలోని మూసీ నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియామార్చురీకి తరలించారు. వివరాలకు పోన్ 8712660425 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.